
సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది నరసన్న ఆలయంలో నిత్యాన్నదానానికి పులెపు త్రిమూర్తులు, అనంతలక్ష్మి దంపతులు (నరసాపురం) బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు.



డెల్టాకు 5,800 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 5,800 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 7.75 అడుగుల నీటి మట్టం కొనసాగుతోంది.

గరిష్ఠం/కనిష్ఠం 42.0°/25.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.0	25.0
కాకినాడ	39.9	27.1
అమలాపురం	41.0	25.0

ప్రగతి పరవళ్లు.. సంక్షేమ ఒరవళ్లు

- తూర్పుగోదావరి జిల్లాలో రూ.25,436 కోట్ల సంక్షేమం
- ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్లలో భారీ స్థాయిలో నిధుల వెచ్చింపు
- మేనిఫెస్టోలో ప్రకటించని పథకాలు సైతం అమలు
- 33 పథకాలు, అభివృద్ధి పనుల అమలు
- దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు

సంక్షేమం ఇలా..

పథకం	లబ్ధిదారులు	అందజేసిన మొత్తం రూ.కోట్లల్లో
వైఎస్సార్ కాపునేస్తం	31,389	174.44
రైతు భరోసా	1,33,502	584.66
ఆరోగ్యశ్రీ	1,69,048	315.65
ఆరోగ్య ఆసరా	86,141	46.94
నేతన్న నేస్తం	916	8.79
ఉచిత పంటల బీమా	67,513	102.38
పంట రుణాలు	27,183	5.01
ఇన్‌పుట్ సబ్సిడీ	52,182	63.97
చేదోడు	13,491	35.61
విద్యాదీవెన	70,241	142.99
వసతి దీవెన	69,098	65.56
అమ్మ ఒడి	1,56,000	234
బ్యాంక్ లింకేజ్	84,593	15969.85
సున్నా వడ్డీ	33,498	145.94
వైఎస్సార్ ఆసరా	27,417	728.9
పింఛను కానుక	2,44,989	3048.16
జగనన్న తోడు	1,12,217	167.61
శ్రీనిధి	81,141	374.58
కల్యాణమస్తు, షాదీతోఫా	1,307	9.82



గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ఇథనాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రాజమహేంద్రవరంలో నిర్మించిన గవర్నమెంట్ మెడికల్ కాలేజీ

సాక్షి, రాజమహేంద్రవరం: సంక్షేమ చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖితమైంది.. అభివృద్ధిలో అనంతమైన అడుగు పడింది.. తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలు స్వయంగా చూసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే వాటిని తొలగించేందుకు తీసుకొచ్చిన నవరత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలకు రూ.వేల కోట్ల నిధులు వెచ్చించారు. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే గతేడాది డిసెంబర్ మాసం నాటికి రూ.25,436 కోట్లు ఖర్చు పెట్టారంటే అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. పేదలు, మధ్య తరగతి వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. పార్టీ, వర్గం, కులం అన్న భేదాలు లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని గడప వద్దకే అందిస్తున్నారు. ప్రభుత్వ సుపరిపాలనను గమనించిన ప్రజలు మరోసారి జగనే కావాలని ఆకాంక్షిస్తున్నారు.

అభివృద్ధికి నాంది

నవ్య తూర్పుగోదావరి జిల్లాలో అనేక అభివృద్ధి పనులకు నాంది పడింది. వాటిలో మచ్చుకకొన్ని ప్రస్తావిస్తే... రాజమహేంద్రవరంలో రూ.475 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాల నిర్మాణం జరిగింది. విద్యా సంవత్సరం నుంచి 150 మంది ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం వైద్య విద్యను అభ్యసించాలంటే ఖరీదైన విషయం. డబ్బున్న వారు ఇతర ప్రాంతాలు, దేశాల్లో తమ పిల్లలకు రూ.కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. అంతటి ప్రాధాన్యం ఉన్న విద్యా విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు.

- పేదల సొంతింటి కల సాకారమైంది. జిల్లావ్యాప్తంగా 1.46 లక్షల మందికి ఉచితంగా ఇంటి పట్టాలు అందజేశారు. తొలి దశలో రూ.113.48 కోట్లతో 63,000 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇవి సింహభాగం పూర్తవగా.. మరికొన్ని వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.

పారిశ్రామిక రంగం పరుగులు

అనపర్తి నియోజకవర్గం బలభద్రపురంలో రూ.2,500 కోట్లతో గ్రాసిమ్ కాస్టిక్ సోడా పరిశ్రమ స్థాపించారు. 2,500 మందికి ఉపాధి దక్కుతోంది. ఇది మరింత విస్తరించే దిశగా చర్యలు చేపట్టారు.

- గోకవరం మండలం గుమళ్లదొడ్డి వద్ద రూ.260 కోట్లతో ఇథనాల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం వీటి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరలోనే పరిశ్రమ అందుబాటులోకి వచ్చే అవకాశాలు దర్శనమిస్తున్నాయి. పరిశ్రమ నిర్మాణం పూర్తయితే 210 మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి దక్కుతుంది.
- కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడి గ్రామం వద్ద మరో భారీ పరిశ్రమకు నాంది పలికారు. 26.65 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,350 కోట్ల పెట్టుబడితో త్రివేణి రెన్యువబుల్స్ సంస్థ ఆధ్వర్యంలో సోలార్ గ్లాస్ తయారీ పరిశ్రమకు అడుగులు పడ్డాయి. పరిశ్రమ ద్వారా 2400 మందికి ఉద్యోగాలు దక్కాయి.
- నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలో 14 ఎకరాల్లో జాగృతి బయోటెక్ ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో బయోటెక్నాలజీ కంపెనీ అందుబాటులోకి రానుంది. రూ.50 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఈ సంస్థ పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంటే 81 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఎంఎస్‌ఎంఈలతో ఉపాధి

2023లో 2,427 ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటయ్యాయి. రూ.39.557 లక్షల మేర పెట్టుబడులు వచ్చాయి. 10,179 మందికి ఉపాధి దక్కింది. రాజమహేంద్రవరం నగరానికి రూ.423 కోట్లు వెచ్చించారంటే ఏ స్థాయిలో అభివృద్ధి జరిగిందో అర్థం అవుతుంది.

నాలుగున్నరేళ్లలో రూ.25,436 కోట్ల వెచ్చింపు

ఇలా జిల్లా వ్యాప్తంగా 33 పథకాలతో ప్రజలకు మేలు చేకూరుస్తున్నారు. నాలుగున్నరేళ్లలో ఒక్క తూర్పుగోదావరి జిల్లాకే రూ.25,436 కోట్లు వెచ్చించడం గమనార్హం.

పెద్ద ఎత్తున ప్రాధాన్యత భవనాలు

- నాడు-నేడులో 1,069 పాఠశాల భవనాలకు రూ.369.89 కోట్లు వెచ్చించారు.
- పేదలందరికీ స్వగృహాలు కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో 68,518 మందికి రూ.1233.34 కోట్లు వెచ్చించారు.
- సంక్షేమ పథకాలు అందించేందుకు ఉద్దేశించిన గ్రామ, వార్డు సచివాలయాలకు సొంత భవనాల నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. 336 గ్రామ సచివాలయాలకు రూ.108.47 కోట్లు వెచ్చించారు.
- 279 రైతు భరోసా కేంద్రాలకు భవన నిర్మాణాల నిమిత్తం రూ.52.31 కోట్లు ఖర్చు చేశారు.
- గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించే 208 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రూ.38.17 కోట్లు వెచ్చించారు.
- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 1,443 పనులకు రూ.52.89 కోట్లు ఖర్చు చేశారు.
- 3,079 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు.
- 15,369 చిన్న పరిశ్రమలకు రూ.670.85 కోట్ల రాయితీలు అందజేశారు.
- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా ఆర్థిక సాయం అందజేస్తోంది. ప్రతి ఏడాది సుమారు 9,590 మంది రైతులకు రూ.7.19 కోట్లకు పైగా ఆర్థిక సాయం వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు.
- వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటల రైతు రూ.68 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసింది.

భారీ స్థాయి పరిశ్రమల ఏర్పాటు ఈ విధంగా..

సంవత్సరం	యూనిట్లు	ఉద్యోగాల కల్పన	పెట్టుబడులు రూ.కోట్లల్లో
2019	37	16,343	5937.65
2019 ఏప్రిల్-2023 సెప్టెంబర్	1	1,203	861

జిల్లాలో రూ.3,760 కోట్లతో మరో నాలుగు భారీ స్థాయి పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇవి కార్యరూపం దాల్చితే 5,910 మందికి ఉపాధి దక్కనుంది.

న్యూస్‌రీల్

పేపర్ మిల్లు లాకౌట్ ప్రకటన



నోటీస్ బోర్డులో ఏర్పాటు చేసిన లాకౌట్ నోటీస్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) : స్థానిక ఆంధ్ర పేపర్ లిమిటెడ్ యాజమాన్యం బుధవారం మాధ్యాహ్నం మూడు గంటల (బి షిఫ్ట్) నుంచి లాకౌట్‌ను ప్రకటిస్తున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 2 నుంచి పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 2,800 మంది విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. నూతన వేతన ఒప్పందం చేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని వంటి ప్రధాన డిమాండ్‌లతో 13 కార్మిక సంఘాలు 22 రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో పేపర్ మిల్లు యాజమాన్యం బుధవారం లాకౌట్ ప్రకటన చేసింది. కార్మికులు సమ్మె చేయ్యడం వల్ల మిల్లు ఆవరణలో, పరిసర ప్రాంతాల్లోకి దౌర్జన్య పూరిత శక్తులు చొరబడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రమాదం ఉందని, భవిష్యత్‌లో మిల్లు నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంటుంది కాబట్టి లాకౌట్ ప్రకటిస్తున్నట్లు యాజమాన్యం నోటీస్‌లో పేర్కొంది.

అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలి

తక్షణమే అక్రమ లాకౌట్ ఎత్తి వేయాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్, జిల్లా కలెక్టర్ సమక్షంలో చర్చలు జరిగినప్పటికి ,యాజయాన్యం మొండి వైఖరితో లాకౌట్ ప్రకటించడం కక్ష సాధింపు చర్యగా అభివర్ణించారు.

ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనాను కలసిన ఎస్పీ



బలరామ్ మీనాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాకు విచ్చేసిన స్పెషల్ జనరల్ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనాను జిల్లా ఎస్పీ పి.జగదీష్ బుధవారం కలిశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో పోలీస్ ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించేందుకు స్పెషల్ జనరల్ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనా రాజమహేంద్రవరం వచ్చారు.

నేటితో నామినేషన్లకు తెర



నామినేషన్ వేసేందుకు బొమ్మూరు జాతీయ రహదారిపై ర్యాలీగా వెళ్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



అనపర్తిలో ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక సంగ్రామంలో తొలి ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గడువు గురువారంతో ముగియనుంది. మధ్యాహ్నం 3 గంటలకు దాఖలు ప్రక్రియ నిలిచిపోనుంది. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తారు. 29న ఉపసహరణ ప్రక్రియ కొనసాగుతుంది. ఇందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఈ నెల 18వ తేదీన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఇప్పటి వరకు వివిధ పార్టీలకు చెందిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తమ నామినేషన్లు ఆయా ప్రాంతాలకు చెందిన ఎన్నికల రిటర్నింగ్ అధికారుల వద్ద సమర్పించారు. తొలి రెండు రోజుల్లో ముహూర్తం బాగుండటంతో రెండు రోజుల పాటు నామినేషన్లు ఊపందుకున్నాయి. మిగిలిన రోజుల్లో సైతం అభ్యర్థులు కోలాహలంగా నామినేషన్లు సమర్పించారు.

మంత్రి వేణు నామినేషన్

వైఎస్సార్ సీపీ రాజమండ్రి రూరల్ అసెంబ్లీ అభ్యర్థిగా మంత్రి చెల్లుబోయిన వేణు బొమ్మూరు జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నామినేషన్ అట్టహాసంగా దాఖలు చేశారు. మంత్రి కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి ఉన్నారు.

అనపర్తిలో..

వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. పత్రాలను రిటరి్నంగ్ అధికారి ఎం.మాధురికి అందజేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ల దాఖలు పూర్తయింది. మిగిలిన ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం ప్రక్రియ పూర్తి చేశారు. నేడు రెబల్, డమ్మీ నామినేషన్లు వేయనున్నారు.

రాజానగరంలో ఇద్దరు బత్తుల బలరామకృష్ణలు

రాజానగరం నియోజకవర్గంలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. జనసేన అభ్యర్థిగా ఇప్పటికే బత్తుల బలరామ కృష్ణ నామినేషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాగాజా బుధవారం రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి బత్తుల బాలరామకృష్ణ (పల్నాడు జిల్లా) నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒక నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి ఏ.చైత్ర వర్షిణికి అందజేశారు. రాజమండ్రి ఎంపీ స్థానానికి సైతం నామినేషన్ దాఖలు చేశారు.

ప్రజలకు అందుబాటులో ఎన్నికల పరిశీలకులు

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంటామని తూర్పుగోదావరి జిల్లాకు సాధారణ పరిశీలకులుగా వ్యవహరిస్తున్న కె.బాలసుబ్రహ్మణ్యం, కమల్‌కాంత్ సరోచ్ ఒక ప్రకటనలో తెలిపారు. ధవళేశ్వరం కాటన్ అతిథి గృహంలో గురువారం నుంచి మే 12వ తేదీ వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బాలసుబ్రహ్మణ్యం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు కమల్ కాంత్ సరోచ్ అందుబాటులో ఉంటామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం అర్బన్, రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజక వర్గాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గానికి కె.బాలసుబ్రమణ్యం 89779 35105 పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు కమల్ కాంత్ సరోచ్ 89779 35106 వ్యవహరించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల పనులపై ముందస్తు సమాచారం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పోస్టల్ బ్యాలెట్, ఎసెన్షియల్ ఓటింగు, హోమ్ ఓటింగు, ఈవీఎం రెండవ ర్యాండమైజేషన్ , పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపుల షెడ్యూల్ వివరాలు రాజకీయ పార్టీలకు ముందుగా తెలియజేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత అన్నారు. బుధవారం తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ జారీకి సంబంధించిన పనులను పూర్తి చేశామన్నారు. అత్యవసర సేవలు అందించే వారికీ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిమిత్తం వివరాలు తీసుకున్నామన్నారు. పీవో, ఏపీవోలకు రెండో విడత శిక్షణ ఈ నెల 27 న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మే 11, 12 తేదీల్లో పోలింగ్ కేంద్రాలు కేటాయిస్తామని తెలిపారు. మే 1, 2 తేదీలలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ చేపడతామన్నారు. జేసీ తేజ్ భరత్, డీఆర్వో జి. నరసింహులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి తలుపులమ్మ ఉత్సవాలు



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి (గంధామావాస్య) సంబరాలు గురువారం నుంచి మే ఎనిమిది వరకు జరుగుతాయని లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం 7.45 గంటలకు లోవ దేవస్థానంలో గరగలు సంబరం నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు లోవ కొత్తూరు గ్రామంలో గతేడాది భద్రపర్చిన గరగలను లోవ దేవస్థానానికి తీసుకువచ్చి శుద్ధి చేస్తామన్నారు. అమ్మవారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. జాతరోత్సవాల సందర్భంగా వివిధ పౌరాణిక, జానపద, సాంఘిక నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గరగలను తీసుకువెళ్లి అమ్మవారికి ప్రచారం కల్పిస్తామన్నారు. మే 8వ తేదీన తీర్థం, అమ్మవారి ఊరేగింపు ఏర్పాటు చేశామన్నారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం తర్వాత తొలిసారిగా ఉత్సవాలను లోవ కొత్తూరు గ్రామంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జామాయిల్ తోట దగ్ధం



కాలిపోయిన జామాయిల్ చెట్లు

గోపాలపురం: జామాయిల్ తోట కాలిపోయిన ఘటనలో సుమారు రూ.4 లక్షల నష్టం సంభవించింది. గోపాలపురం మండలం గుడ్డిగూడెం గ్రామ శివారులోని తోట రాజబాబుకు చెందిన మూడు ఎకరాల జామాయిల్ తోట బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ. 4 లక్షల నష్టం జరిగింది. అలాగే తూతిగ రామకృష్ణ, గంగ్రోతు శ్రీరామమూర్తిలకు చెందిన సుమారు 50 మామిడి మొక్కలు, వరిగడ్డివాము కాలిపోయాయి. వీటి నష్టం సుమారు రూ. రెండు లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

అభయారణ్యం.. ప్రకృతి సోయగం



కోరంగి అభయారణ్యం స్వాగత ద్వారం వద్ద పర్యాటకులు

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న కోరంగి
- అలరిస్తున్న అందాలు
- సందర్శకులకు గొప్ప అనుభూతి

తాళ్లరేవు: సందర్శకులు, ప్రకృతి ప్రేమికులను కోరంగి అభయారణ్యం పిలుస్తోంది. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో ప్రకృతి ఒడిలో చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆటపాటలతో సరదాగా గడిపే క్షణాలకు అభయారణ్యం వేదిక కానుంది. ప్రతి ఏటా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అనేక మంది పర్యాటకులు వేసవి సెలవుల్లో ఇక్కడకు వచ్చి సరదాగా గడుపుతారు. కోరంగి అభయారణ్యంలో ఉల్లాసంగా, ఉత్సాహంగా తిరుగుతూ ఉంటారు. ముఖ్యంగా మడ అడవుల్లో చెక్క వంతెనలపై నడుస్తూ, పక్షుల కిలకిలారావాలు, చెట్ల సౌందర్యం, పలు జంతువుల విన్యాసాలను తిలకిస్తూ పరవశించిపోతుంటారు. వాచ్ టవర్, బోట్లపై నుంచి మడ అడవుల అందాలు, సముద్రాన్ని చూసి మంత్రముగ్ధులవుతారు. అభయారణ్యంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ అందరితో ఉత్సాహంగా గడపడం మరువలేని జ్ఞాపకంగా నిలుస్తుంది. ఈ మేరకు పర్యటకుల సౌకర్యార్థం తాగునీరు, తినుబండారాల దుకాణాలను అటవీ శాఖ ఏర్పాటు చేసింది. వీటితో పాటు పర్యాటకులకు మరింత అనుభూతినిచ్చేలా పలు నిర్మాణాలు చేపట్టారు.

ప్రత్యేక ఆకర్షణ

పర్యాటకులకు మరింత అనుభూతినిచ్చేందుకు రూ.25 లక్షలతో అభయారణ్యంలో విశేషాలను తెలియజేసే మినీ థియేటర్, మత్స్య, పక్షిజాతులను వీక్షించేలా అక్వేరియం, ప్రకృతి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో సంచరించే మత్స్య జాతులను వీక్షించే విధంగా నూతనంగా భారీ ఎక్వేరియం నిర్మించారు. ఇది అభయారణ్యానికే ప్రత్యేక ఆకర్షణ కానుంది. వీటితో పాటు మడ అడవుల ప్రాముఖ్యతను తెలియజేసేలా డాక్యుమెంటరీని రూపొందించి మినీ థియేటర్‌లో పది నిమిషాలు ప్రదర్శించే విధంగా ఏర్పాట్లు చేశారు. వివిధ రకాల పక్షులను పర్యాటకులు చూసేలా ప్రత్యేక భారీ పంజరాలను పెట్టారు. వివిధ రకాల మొక్కలను ప్రదర్శించనున్నారు.



అభయారణ్యంలో విశేషాలను తెలియజేసే మినీ థియేటర్



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అక్వేరియం



పక్షులు, మొక్కలను వీక్షించేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతి స్టాల్

అలరించే బోటు షికార్, క్రీక్ విజిట్

అభయారణ్యంలో పర్యాటకులకు బోటు షికారు ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఏపీ టూరిజం, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బోట్లపై గోదావరి పాయలో ప్రయాణించి సముద్రం కలిసే ప్రాంతానికి తీసుకువెళతారు. అక్కడి నుంచి మడ అడవుల అందాలతో పాటు, కాకినాడ సిటీ అందాలు పర్యాటకులను అలరిస్తాయి. మడ చెట్లపై సంచరించే వివిధ రకాలు పక్షులు, జంతువులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. అదే విధంగా కేరళ తరహాలో మడ అడవుల్లో ఉండే చిన్నపాటి క్రీక్ (పిల్ల కాలువలు)లలో పర్యాటకులు బోట్లపై తిరిగేలా క్రీక్ విజిట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. బోటుపై విహరిస్తూ అభయారణ్యం అందాలను ఆస్వాదించడం మరచిపోలేని అనుభూతినిస్తుంది.

కన్నుల పండువగా శ్రీపుష్పోత్సవం

- ముగిసిన కల్యాణోత్సవాలు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి



వాడపల్లి ఆలయంలో స్వామివారి పల్లకీ ఊరేగింపు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి శ్రీ పుష్పోత్సవం బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. దీనితో ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా వాడపల్లి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, బాలభోగం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి భక్తుల గోవింద నామస్మరణ నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. వైఖానస పండితుడు శ్రీమాన్ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములు శ్రీ పుష్పోత్సవాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. వివిధ రకాల పిండి వంటలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలోని అద్దాల మంటపంలో వివిధ రకాల పువ్వులతో అలంకరించిన ఊయలలో స్వామివారిని జోల పాటలతో శయనింపజేశారు. వందల మంది దంపతులకు దంపతి తాంబులాలు అందించారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ర్యాలీలో..

పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలిలోని జగన్మోహినీ కేశవస్వామి శ్రీపుష్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం ఉదయం వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి స్వామివారికి శ్రీ పుష్పోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వైబీ కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో పుష్పోత్సవం

రెండు వాహనాలను ఢీకొన్న మినీ లారీ

- ఎనిమిది మందికి గాయాలు
- స్తంభించిన ట్రాఫిక్



మినీలారీ డ్రైవర్‌ను బయటకు తీసుకువస్తున్న స్థానికులు



ప్రమాదంలో ఛిద్రమైన ఆర్టీసీ బస్సు ముందుభాగం

ఆలమూరు: జొన్నాడ - మండపేట రహదారిలోని ఎస్ మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. వారిలో మినీలారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మినీ లారీ ధాన్యం లోడుతో తాడేపల్లిగూడెం నుంచి మండపేటలోని రైసుమిల్లుకు బయలు దేరింది. స్థానిక ఎస్ మలుపు వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి విజయవాడ వెళుతున్న అల్ట్రా లగ్జరీ బస్సును వేగంగా ఢీకొంది. దీంతో బస్సు అద్దాలు పగిలిపోయి ముందుభాగమంతా నుజ్జునుజ్జయ్యింది. మిని లారీ అదే వేగంతో జొన్నాడ వైపు వెళుతున్న లారీ వెనుక భాగాన్ని కూడా ఢీకొంది. ఈ ప్రమాదంతో మినీ లారీలోని డ్రైవర్, మండపేటకు చెందిన చింతలపూడి రాజు కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. అతడి హాహాకారాలు విని స్థానికులు అక్కడకు చేరుకున్నారు. పగ్గాలు, గునపాల సాయంతో సుమారు గంట పాటు శ్రమించి అతడిని బయటకు లాగారు. ఈ ప్రమాదంలో రాజు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తం

మినీ లారీ ఢీకొన్న వెంటనే విజయవాడ డిపోకు చెందిన ఆర్‌టీసీ డ్రైవర్ పి.సోమయ్య అప్రమత్తంగా వ్యవహరించాడు. బస్సును పక్కనే ఉన్న పంట కాలువ పక్కకు దింపడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ బస్సులో ప్రయాణిస్తున్న 28 మంది ప్రయాణికుల్లో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

నిలిచిన వాహనాలు

రోడ్డు ప్రమాదం కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సుమారు కిలోమీటర్ మేర గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఆలమూరు ఎస్సై ఎల్. శ్రీను నాయక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కారు ఢీకొని మహిళ మృతి

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరం శివారున గల జీడిపప్పు పరిశ్రమ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణ నగర్‌కు చెందిన పి.రాము (68) అనే మహిళ మృతి చెందగా ఆమె సోదరి, ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ ఎస్సై రమేష్ బాబు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. సోదరి తంగెళ్ల సత్యవతి, కుమార్తెలు వి.సూర్యవతి, బండారు రాజేశ్వరితో కలసి పి.రాము వి.కొత్తూరులో బంధువు పెద కార్యానికి వెళ్లారు. మధ్యాహ్నం భోజనం అనంతరం తిరుగు ప్రయాణంలో నడిచి వస్తుండగా అన్నవరం నుంచి తుని వైపు వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో రాము మృతి చెందగా తంగెళ్ల సత్యవతి, వి.సత్యవతి, రాజేశ్వరి గాయపడ్డారు. వీరిని 108లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తంగెళ్ల సత్యవతిని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ మరోసారి సీఎం కావాలంటూ యాగం



సుదర్శన యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

మండపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కత్రి పాపారాయుడు బుధవారం అర్తమూరులో మహా సుదర్శన యాగం ప్రారంభించారు. విశాఖపట్నానికి చెందిన వేద పండితుడు ఇలపర్తి భానువెంకటరత్నంశర్మ, ఆయన శిష్య బృందం ఈ యాగం నిర్వహిస్తున్నారు. శ్రీ లక్ష్మీనరసింహ మంటపం ఆరాధన, అప మృత్యుదోష పరిహారార్థం మృత్యుంజయ మహా సుదర్శన పూర్వక లక్ష్మీనరసింహస్వామి పూజ, ఆదిత్యాది నవగ్రహ పూజలను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు కత్రి పాపారాయుడు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జగన్ విజయం కోరుతూ ఇటువంటి యాగం జరపడం ఇదే మొదటిసారి అన్నారు.

నిఘా బృందాల విస్తృత తనిఖీలు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం, ఓటర్ల ప్రలోభ పెట్టే వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ, ఎస్ఈబీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ నిఘా బృందాలు విస్తృత తనిఖీలు, దాడులు కొనసాగిస్తున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆధ్వర్యంలో జిల్లాలో మంగళ, బుధవారాల్లో జరిగిన దాడులు, తనిఖీల్లో ఈ నిఘా బృందాలు మొత్తం రూ.25 లక్షలకు పైగా నగదు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ వివరాలను అమలాపురంలోని ఎస్పీ కార్యాలయం బుధవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది.

- నిఘా బృందాలు జిల్లాలో మంగళవారం దాడులు, తనిఖీలు నిర్వహించి రూ.17.71 లక్షలు, రూ.4,87,569 విలువైన 7.49 కేజీల వెండి ఆభరణాలను సీజ్ చేశాయి.
- ఇవే బృందాలు బుధవారం నిర్వహించిన తనిఖీలలో రూ.2.20 లక్షలను స్వాధీనం చేసుకున్నాయి.



రామచంద్రపురం నియోజకవర్గంలోని చెక్ పోస్టులో నగదును స్వాధీనం చేసుకున్న నిఘా అధికారులు

- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దుల చెక్ పోస్టుల్లో తనిఖీలు జరిగాయి.
- రెండు రోజుల్లో నిఘా బృందాలు మొత్తం రూ.19.91 లక్షలు, రూ.4,87,569 విలువైన వెండి ఆభరణాలతో రూ.25 లక్షలకు పైగా సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ శ్రీధర్ ఈ ప్రకటనలో తెలిపారు.



కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీరంగనాయకులు

కారులో రూ.లక్ష స్వాధీనం

ప్రత్తిపాడు: కారులో తరలిస్తున్న రూ.లక్ష నగదును బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తొండంగి మండలం పీఈ చిన్నయ్య పాలెం నుంచి రాజమహేంద్రవరానికి ములికి సత్యనారాయణ కారులో వెళుతున్నారు. స్థానిక జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎం శ్రీరంగనాయకులు వాహన తనిఖీ చేపట్టగా రూ.లక్ష పట్టుబడింది. దానికి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని, రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

సత్యదేవునికి పెద్ద రథం సిద్ధం

- రూ.1.08 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికే పూర్తయిన చిన్నరథం



సత్యదేవుని పెద్ద టేకు రథం



రథం ముందు భాగంలో ఏర్పాటు చేసే శిల్పం

అన్నవరం: సత్యదేవుని ఊరేగింపునకు భారీ టేకు రథం సిద్ధమైంది. ఆలయ చరిత్రలో తొలిసారిగా పూర్తి టేకుతో మూడంతస్తులతో 35.8 అడుగుల ఎత్తు, 14.8 అడుగుల వెడల్పుతో ఈ రథాన్ని రూపొందించారు. రథానికి గురువారం చక్రాలు అమర్చుతారని, దీనితో పనులన్నీ పూర్తవుతాయని ఈవో కె.రామచంద్రమోహన్ తెలిపారు. ఈ నెల 26వ తేదీ శుక్రవారం రథాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. రూ.1.08 కోట్ల వ్యయంతో 16 మంది శిల్పులు ఆరు నెలల పాటు శ్రమించి ఈ రథాన్ని రూపొందించారు.

పెద్ద రథం లేని లోటు తీరిందిలా..

ప్రతి దేవస్థానంలోనూ ఉత్సవాలలో స్వామి, అమ్మవార్లను పెద్ద రథంపై ఊరేగించడం ఆనవాయితీ. అయితే 135 ఏళ్ల చరిత్ర కలిగిన అన్నవరం దేవస్థానంలో పెద్ద రథం లేదు. సత్యదేవుని కల్యాణ మహోత్సవాల సమయంలో గ్రామంలో ఊరేగించేందుకు సుమారు 40 ఏళ్ల క్రితం తయారు చేసిన వెండి రథం ఉంది. ఇదే రథాన్ని రత్నగిరిపై స్వామివారి ఉత్సవాలలోనూ, వార్షిక కల్యాణ మహోత్సవాల సమయంలో కొండ దిగువన జరిగే ఊరేగింపులో ఉపయోగిస్తున్నారు.

రూ.1.42 కోట్లతో రెండు రథాలు

వెండి రథం శిథిలావస్థకు చేరుకోవడంతో టేకుతో రెండు రథాలను రూపొందించాలని భక్తులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది ఆగస్టులో రూ.1.42 కోట్లతో నాణ్యమైన బస్తరు టేకుతో రెండు రథాలను నిర్మించేందుకు అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ టెండర్లు పిలిచి ఖరారు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లకు చెందిన శ్రీమాణిక్యాంబ శిల్పకళ ఉడ్‌వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, కొల్లాటి శ్రీనివాస్‌లకు తయారీ పనులు అప్పగించారు. ఇందులో భాగంగా రూ.34 లక్షలతో తయారు చేసిన చిన్న టేకు రథాన్ని ఫిబ్రవరిలో ఈఓ రామచంద్రమోహన్ ప్రారంభించారు.

26న రథాన్ని ప్రారంభిస్తాం

సత్యదేవుని పెద్ద రథాన్ని ఈ నెల 26వ తేదీన ప్రారంభించనున్నాం. తర్వాత పాలిష్ పనులు, ముందు భాగంలో గుర్రాలను ఏర్పాటు చేస్తారు. స్వామివారి కల్యాణోత్సవాల సమయంలో గ్రామంలో ఈ రథంపై సత్యదేవుడు, అమ్మవార్లను ఊరేగిస్తాం. రథానికి పంపా సత్రంలోనే షెడ్డు నిర్మిస్తున్నాం.

– కె.రామచంద్రమోహన్, ఈఓ